క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో ఈనెల 15వ తేదీన అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ప్రముఖ వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తామన్నారు. అలాగే అవసరమైన వారికి ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్షలు చేస్తామన్నారు.

నీతి, నిజాయితీకి మారుపేరు దేవినేని శివాజీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): నీతి నిజాయితీకి మారుపేరు వైఎస్సార్ సీపీ నాయకుడు దేవినేని శివాజీ అని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కొనియాడారు. స్థానిక మధురానగర్ కర్మల భవనంలో బుధవారం దేవినేని శివాజీ సంస్మరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. పార్టీ పటిష్టతకు ఆయన అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో దేవినేని సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్ నగర్ నుంచి నున్నకు వెళ్లే నూజివీడు ప్రధాన రహదారి వెంబడి ఉన్న అమెరికన్ హాస్పిటల్ వద్ద అన్న క్యాంటీన్ పునఃప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. రూ.7 లక్షల రూపాయల వ్యయంతో దీనికి మరమ్మతులు చేపట్టినట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

కేజీన్నర గంజాయి కలిగి ఉన్న వ్యక్తి అరెస్ట్

పాయకాపురం(విజయవాడరూరల్): దేవీనగర్ రైల్వేట్రాక్ వద్ద కేజీన్నర గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. దేవీనగర్ 8వ లైను రైల్వే ట్రాక్ పక్కన గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రాగా ఉమెన్ ఎస్ఐ పీడీఎల్ ప్రసన్న సిబ్బందితో వెళ్లి అద్దంకి సతీష్(30)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని దగ్గర ఉన్న కవర్ స్వాధీనం చేసుకోగా దానిలో కేజీన్నర గంజాయి ఉంది. స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా తాను వుడ్ పాలిష్ వర్కు చేస్తూ వచ్చిన ఆదాయం చాలకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి అధిక రేట్లకు రైల్వే స్టేషన్లు, బస్టాండు వద్ద అమ్ముతున్నట్లు సతీష్ తెలిపాడు. సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

దోమతెరలు పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్ నగర్లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో బుధవారం గర్భిణులకు, బాలింతలకు దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లెప్రా సొసైటీ స్టేట్ కోఆర్డినేటర్ రాధిక మాట్లాడుతూ వర్షాకాలంలో సంక్రమించే మలేరియా, డెంగీ తదితర వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి దోమతెరలు దోహదం చేస్తాయన్నారు. గర్భిణులు, బాలింతలు దోమతెరలను సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. వైద్యాధికారి డాక్టర్ వి.రాథోడ్ మాట్లాడుతూ తమ ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు దోమతెరలు అందించిన తెనాలి డబుల్ హార్స్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల నుంచి గర్భిణులు, బాలింతలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లెప్రా సొసైటీ ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహీద్ బాషా, పీటీ నాగరాజు పాల్గొన్నారు.

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): సాంబమూర్తి రోడ్డులోని దుర్గాపురం వాకర్స్‌క్లబ్‌లో బుధవారం ఉషా సాయి తుకారం ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ ఆర్‌ఓ ప్లాంట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెంట్రల్ నియోజకవర్గంలోని ఉద్యానవనాలను అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌లను మెరుగు పరచనున్నట్లు తెలిపారు. అనంతరం ఉద్యానవనంలోని ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌లను పరిశీలించారు. మొక్కలు నాటారు.



తిరంగా ర్యాలీ.. భారీ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మువ్వన్నెలతో ముస్తాబు





స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ప్రభుత్వం గురువారం నిర్వహించే కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ పథకాలకు సంబంధించిన శకటాలను సిద్ధం చేశారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ నగరంలో బుధవారం పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు భారీ జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీలు నిర్వహించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





స్వాతంత్య్ర కాంతులు.. విద్యుత్ దీపాలంకరణతో మెరిసిపోతున్న విజయవాడ రైల్వే స్టేషన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ భవనం

వీధులన్నీ త్రివర్ణశోభితం



తిరంగా ర్యాలీలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి



సర్కిల్-2 పరిధిలో జరిగిన తిరంగా ర్యాలీలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు



హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

వీఎంసీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ

పటమట(విజయవాడతూర్పు): స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీని వీఎంసీ ఆధ్వర్యంలో నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో నిర్వహించారు. సర్కిల్–1 పరిధిలోని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సర్కిల్–2 పరిధిలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఎన్టీఆర్ జిల్లా సబ్ కలెక్టర్ భవానీ శంకర్, సర్కిల్–3 పరిధిలో జోనల్ కమిషనర్ శివరామకృష్ణ పాల్గొన్నారు. నగర పౌరులు విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన సంతకాల సేకరణలో సంతకం చేసి జెండా పండుగకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విజయవాడ నగర ప్రజలందరూ ప్రతి ఇంట్లో జాతీయ పతాకాన్ని ఎగరవేస్తూ తమ దేశభక్తిని చాటి చెప్పేందుకు ఒక సువర్ణ అవకాశమని తెలిపారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, సబ్ కలెక్టర్ భవాని శంకర్, సర్కిల్–2 పరిధిలోని బీఆర్‌టీఎస్ రోడ్డులో శారదా కాలేజ్ వద్ద హర్ ఘర్ తిరంగా అంటూ ఏకేటీపీ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు 125 అడుగుల జాతీయ జెండాను పట్టుకొని నగర ప్రజలకు జాతీయ జెండా ప్రతి ఇంట్లో ఎగరవేయాలని అవగాహన కల్పించారు. సర్కిల్–3 పరిధిలోని విశాలాంధ్రరోడ్డులో స్వయం సహాయక గ్రూపులతో జోనల్ కమిషనర్ జాతీయ జెండా ర్యాలీ నిర్వహించారు. వీఎంసీ అడిషనల్ కమిషనర్ (జనరల్) డాక్టర్ ఎ.మహేష్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. రత్నావళి అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, అసిస్టెంట్ ఎకౌంట్స్ ఎగ్జామినర్ సుబ్బారెడ్డి, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

దేశ భక్తి పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యార్థి దశ నుంచే దేశ భక్తి పెంపొందించుకోవాలని దేశం మనకు ఏమి ఇచ్చిందని కాకుండా దేశానికి మనం ఏం చేశామని ఆలోచించాలని శ్రీ భారతీయ విద్యామందిర్ డీన్ జేవీ షణత్ కృష్ణ, ప్రిన్సిపాల్ స్వప్న అన్నారు. స్థానిక లక్ష్మీనగర్ శ్రీ భారతీయ విద్యామందిర్ పాఠశాలలో బుధవారం హరఘర్ తిరంగా ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశ భక్తి పెంచటానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు భరతమాత, ఝాన్సీలక్ష్మీబాయి, సిపాయిలు, స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలతో జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేయకుండా చర్యలు



శివారు ప్రాంతాల్లో పర్యటిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజారోగ్యం, రెవెన్యూ అధికారులు నిరంతరం చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. సర్కిల్ వన్ పరిధిలోని 41, 42, 43, 45 డివిజన్లో బుధవారం ఆయన పర్యటించారు. స్వాతి రోడ్, చర్చ్ జంక్షన్, సితార జంక్షన్, గొల్లపూడి ఎట్కిన్ సన్ రోడ్డు, ఐరన్ యార్డ్, వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్, హెచ్.బి కాలనీ దర్గా ఫ్లాట్స్ రోడ్, వాసవీ కల్యాణ మండపం రోడ్డు, బేతపూడి అరుణకుమారి రోడ్డులో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కబేళాలోని ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని, స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వర్షపు నీటి నిల్వలను తోడేయాలని సూచించారు. దోమలకు నివాసంగా ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడ ఆయిల్ బాల్స్ వేయాలని కోరారు. ఐరన్ యార్డులో లారీ స్టాండ్ దగ్గర ఉన్న వ్యర్థాలు, చెత్త చెదారాలను గమనించి వాటిని అక్కడి నుంచి వెంటనే తరలించాలని తెలిపారు. శివారు ప్రాంతాల్లో వ్యర్థాలు ఎక్కువగా పేరుకుపోతున్నాయని దీనిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని పేర్కొన్నారు. పర్యటనలో జోనల్ కమిషనర్–1రమ్య కీర్తన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరానికి ఫ్రిడ్జ్ వితరణ



ఫ్రిడ్జిలో కూరగాయలు వేస్తున్న మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో నిత్యాన్నదానానికి కూరగాయలు భద్రపరచుకునేందుకు అవసరమైన భారీ ఫ్రిడ్జ్‌ను బుధవారం యూఎస్‌కు చెందిన దాత నాగచంద్రశేఖర్, నాగరూప భవాని దంపతులు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి రూ. 50వేలు విలువ చేసే ఫ్రిడ్జ్‌ను దాత నాగచంద్రశేఖర్ దంపతులు అందజేయటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మందిరం ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరేద్దాం

కలెక్టర్ డాక్టర్ సృజన



హర్ ఘర్ తిరంగా ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న కలెక్టర్ సృజన తదితరులు



భారత్ మ్యాప్ ఆకారంలో విద్యార్థుల మానవహారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎందరో మహానుభావుల త్యాగాలతో దేశానికి స్వాతంత్య్రం వచ్చిందన్నారు. ఆ త్యాగమూర్తులను స్మరించుకుంటూ, దేశ సమగ్రతకు, సమైక్యతకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సూచించారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్‌పటేల్, భగత్ సింగ్, లాల్ బహదూర్ శాస్త్రి, ఝాన్సీలక్ష్మీబాయి, సరోజిని నాయుడు, అల్లూరి సీతారామరాజు, పింగళి వెంకయ్య వంటి ఎందరో స్వాతంత్య్ర సమరయోధులు భరత మాతపై చూపిన ప్రేమ, భక్తి భావాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య కీర్తిని నలుదిశలా చాటిచెప్పేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించాలన్న దేశ ప్రధాని సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు తెలిపారు. అనంతర ఆమె జాతీయ జెండాను చేతబూని విద్యార్థినీ విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజా గాయకుడు పిచ్చయ్య ఆలపించిన దేశ భక్తి గేయాలు ఆలోచింపజేశాయి. అనంతరం విద్యార్థులు జాతీయ జెండాలతో భారత మ్యాప్ ఆకారంలో మానవహారంగా నిలబడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బి.హెచ్.భవానీశంకర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, తహసీల్దార్లు ఆర్.వి.వి.రోహిణీదేవి, సీహెచ్.శిరీష, సూర్యారావు, ఇంతియాజ్ పాషా, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్‌డీ డాక్టర్ వెలగా జోషి, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, నెహ్రూ యువ కేంద్రం కో–ఆర్డినేటర్ ఎస్.రామ్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రమేష్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో–ఆర్డినేటర్ అరవ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



దేశ భక్తి గీతాలకు నృత్యాలను అభినయిస్తున్న విద్యార్థినులు



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ సృజనాత్మక సమితి, ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాల, కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు దేశ భక్తిని చాటాయి. కూచిపూడి నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్ బృందం, నాట్యాచారిణి భాగవతుల సౌమ్య బృందాలు నృత్యాలను ప్రదర్శించాయి. సంగీత కళాశాల గాత్ర విభాగం అధ్యాపకురాలు మల్లాది కార్తీక త్రివేణి బృందం, సంగీత కళాశాల వయోలిన్ అధ్యాపకురాలు విష్ణుభొట్ల కృష్ణవేణి బృందం వేద ధాత్రి, జ్ఞాన నేత్రి, కోటి కంఠమే, మాదేనోయ్ హిందూస్తాన్, ఏ దేశానికికున్నది ఇంత గొప్పచరిత్ర గీతాలను ఆలపించారు. సంగీత కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువతలో దేశ భక్తి బీజాలను నాటాలి

విజయవాడ కల్చరల్: యువతలో దేశ భక్తి బీజాలను నాటాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాల్సిన అవసరముందని తెలిపారు. విశ్రాంత పోలీస్ అధికారి కె. డేవిడ్‌రాజు, శ్యాంప్రసాద్, శింగంశెట్టి చంద్ర శేఖర్, ప్రసూనా రామన్, పరమారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు దేశ భక్తి గీతాలను, తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. పేద కళాకారుడు శివయ్యకు ఆర్థిక సహాయం అందించారు. అతిథులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పునఃపరిశీలించాలి

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల ఫ్రాన్సిస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో వర్గీకరణ తీర్పునకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. ఈ నెల 21న భారత్ బంద్, 24న అన్ని మాల సంఘాలతో విజయవాడలో విస్తృత స్థాయి సమావేశం, నవంబర్ 26 రాజ్యాంగ ఆమోద దినోత్సవం నాడు మాలల మహా గర్జన నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వర్గీకరణ చేస్తామంటూ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చేసిన ప్రకటనలను వెనక్కు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని సంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి జేఏసీగా సుప్రీం తీర్పుకు వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు తుమ్మల ఫ్రాన్సిస్, మల్లెల వెంకట్రావు, బేతాళ శరత్, గోళ్ల అరుణ కుమార్, సిద్ధాంతల కొండబాబు, కాటం రామకృష్ణ, కోన జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు బయటపెట్టానని కక్ష కట్టారు

న్యాయవాది శ్రీనివాసరావు ఆరోపణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మార్గదర్శి అక్రమాలపై న్యాయ పోరాటం చేసినందుకే ఈనాడు దిన పత్రిక తన ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వార్తా కథనాలు రాస్తోందని న్యాయవాది ముష్టి శ్రీనివాసరావు అన్నారు. ఆ పత్రిక కథనాలను శ్రీనివాసరావు ఖండించారు. బుధవారం విజయవాడ గవర్నర్‌పేటలోని తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్గదర్శి లబ్బీపేట బ్రాంచ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న బండారు శ్రీనివాస్ అవినీతి బాగోతం బయటపెట్టానన్నారు. ఆయన అనేక మోసాలకు పాల్పడ్డారన్నారు. ఈ నేపథ్యంలోనే ఈనాడు దిన పత్రికలో తన ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వార్తా కథనాలు రాయిస్తున్నారని ఆరోపించారు. వాస్తవానికి తాను ఇంట్లో ఒంటరిగా ఉంటున్నానన్నారు. తాను లేని సమయంలో ఇంటికి వచ్చిన స్నేహితులు కాలక్షేపానికి పేకాట ఆడుకున్నారన్నారు. ఈ క్రమంలో వారిని పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు. తాను గవర్నర్‌పేట పోలీసులను కలిసి వివరణ కూడా ఇచ్చానన్నారు. కాలక్షేపం కోసం స్నేహితులు పేకాట ఆడుకుంటే దాన్ని ఉద్దేశపూర్వకంగా తప్పుగా టీవీ చానల్‌లో చూపించారన్నారు. తానే స్వయంగా జూద గృహం నిర్వహిస్తున్నానని ప్రచారం చేయడం సరికాదన్నారు. పోలీసులు వచ్చిన సమయంలో తాను పారిపోయాయని పూర్తిగా అసత్య కథనాలు ప్రచురించారన్నారు. వాస్తవానికి తాను ఆ సమయంలో ఇంటి వద్ద లేనన్నారు. 60 ఏళ్ల వయసులో ఉన్న తనను మానసికంగా క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నందకిషోర్, శ్రీలక్ష్మి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని శ్రీమేథ విద్యా సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ అన్నారు. నగరంలోని శ్రీమేథ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. నగరంలోని ఏటీపీ కల్యాణ మండపంలో నిర్వహించిన వేడుకలను తొలుత శ్రీమేథ చైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నందకిషోర్ మాట్లాడుతూ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులు ఒకరితో ఒకరికి పరిచయమేర్పడి కలిసిమెలిసి విద్యను అభ్యసించడానికి అనువుగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. వేడుకల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న మోటివేషనల్ స్పీకర్ అయ్యప్ప మాట్లాడుతూ ఉలి దెబ్బలకు ఓర్చుకున్న రాయి దైవశిల్పంగా మారి పూజలందుకున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల సీఎంఏ ఫౌండేషన్ ఫలితాలు ఆలిండియా మొదటి ర్యాంకులు సాధించిన అన్నా ధీరజ్, షేక్ ఇర్ఫాన్‌లను మెమెంటోలతో సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామ బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామవరప్పాడు గ్రామానికి చెందిన మందల సాయి(26)ఈ నెల 11వ తేదీన అడవినెక్కలానికి బైక్‌పై వెళ్తుండగా నున్న గ్రామ బైపాస్ రోడ్డులో నయారా పెట్రోల్‌బంకు వద్ద బండి స్కిడ్ అయ్యింది. దీంతో సాయి కిందపడటంతో ఎడమ మోచేతికి, కాళ్లకు గాయాలయ్యాయి. చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం పోరంకిలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.